క్లుప్తంగా

ఎమ్మెల్యే లాస్య నందిత మృతికి కంచర్ల సంతాపం

నల్లగొండ టూటౌన్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతికి నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆమె రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరమన్నారు.

తెలుగు పరీక్ష ప్రశాంతం

రామగిరి(నల్లగొండ): నల్లగొండలోని నల్లగొండ పబ్లిక్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం, నార్కట్‌పల్లి శ్రీ విద్యాపీఠ్ పాఠశాలలలో శుక్రవారం జరిగిన సీబీఎస్ఈ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నల్లగొండ పబ్లిక్ స్కూల్‌లో 103 మంది విద్యార్థులు హాజరైనట్లు సెంటర్ సూపరింటెండెంట్ జి.రమేష్‌కుమార్ తెలిపారు. నల్లగొండలోని నల్లగొండ పబ్లిక్ స్కూల్‌లో శ్రీ విద్యాపీఠ్, లిటిల్ ఫ్లవర్ స్కూల్, వివస్య స్కూల్ విద్యార్థులు పరీక్ష రాసినట్లు చెప్పారు. నల్లగొండలోని కేవీఎస్‌లో జరిగిన పరీక్షకు 146 మంది విద్యార్థులు హాజరైనట్లు సెంటర్ సూపరింటెండెంట్ రాచల్ మాథ్యూ తెలిపారు. నార్కట్‌పల్లిలోని శ్రీ విద్యాపీఠ్‌లో 62 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు సెంటర్ సూపరింటెండెంట్ సుష్మిత పేర్కొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

నల్లగొండరూరల్: కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నల్లగొండ మండల కన్వీనర్ పోలే సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లగొండ మండలంలోని అప్పాజిపేట గ్రామంలో స్థానిక పాల కేంద్రం వద్ద రైతు సంఘం కార్మికులతో కలిసి ఆందోళన చేశారు. రైతులు గిట్టుబాటు ధర కోసం ఢిల్లీ సరిహద్దుల్లో పోరాటాలు చేస్తున్నా కేంద్రం స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, నర్సిరెడ్డి, రాములు, సైదులు, లక్ష్మయ్య, అంజయ్య, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కేతేపల్లి: మండల పరిధిలోని మూసీ నది నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకుని కేసు నమోదు చేశామని కేతేపల్లి ఎస్‌ఐ శివతేజ తెలిపారు. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారంతో మండలంలో భీమారం గ్రామంలో పోలీస్ సిబ్బందితో కలిసి శుక్రవారం తనిఖీలు నిర్వహించామని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన గండికోట జానకిరాములు మూసీ నది నుంచి ట్రాక్టర్ ద్వారా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని జానకిరాములపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వివరించారు.

రైతులపై పోలీసుల దాడి హేయమైన చర్య

మర్రిగూడ: పంట మద్దతు ధర చట్టం కోసం ఆందోళన చేస్తున్న రైతులపై హర్యానా రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో దాడి చేయించడం హేయమైన చర్య అని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. మర్రిగూడ మండలంలోని మేటిచందాపురం గ్రామపంచాయతీ ఆవాసం ఇందుర్తి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి వెళ్తున్న రైతులపై హర్యానా సరిహద్దు వద్ద పోలీసులు కాల్పులు జరిపి చంపారన్నారు. మృతిచెందిన రైతు కుటుంబానికి రూ.50లక్షలు, గాయాలపాలైన కుటుంబాలకు రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గిరి వెంకటయ్య, పదం రాములు, యాదయ్య, బొల్లోజు యాదాచారి, ఏరుకొండ లచ్చయ్య, ఊరిపక్క నరసింహ, భిక్షమయ్య, దొడ్డి రఘు, యనమల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

దుండగులను శిక్షించాలి


నినాదాలు చేస్తున్న విద్యుత్ బీసీ ఉద్యోగ సంఘం నాయకులు

నల్లగొండ: మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గంలో జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలని కోరుతు శుక్రవారం విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నల్లగొండలో ఆందోళన చేశారు. ఊట్కూరి గిరి, ఈశ్వర్, కంచోజు మల్లికార్జున్, గంగాధరి రామ్మూర్తి, రమేష్‌కుమార్, రాము, వరికుప్పల వెంకన్న, ఖాదర్‌పాషా పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లు అందజేస్తున్న సంస్థ సభ్యులు

మునుగోడు: మండలంలోని పలివెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దూర ప్రాంతం నుంచి వచ్చి విద్యనభ్యసిస్తున్న 120 మంది విద్యార్థులకు సింక్రోని ఫైనాన్స్ అండ్ ఆసిస్టు సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలు, వృత్తి విద్య కోర్సులకు అవసరమైన పరికరాలను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఫీకి అందజేశారు. కార్యక్రమంలో రవిబాబు మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అండర్‌పాస్ వంతెన నిర్మాణం జరిగేనా


నకిరేకల్ శివారులో ప్రమాదకరంగా పద్మానగర్ జంక్షన్


పూర్తికాని చీమలగడ్డ - ఇనుపాముల సర్వీస్ రోడ్డు

- ప్రమాదకరంగా నకిరేకల్ శివారులోని పద్మానగర్ జంక్షన్
- రోడ్డు దాటాలంటే హడల్
- పూర్తికాని సర్వీస్ దారులు

నకిరేకల్: నిత్యం వాహనాలతో అత్యంత రద్దీగా ఉండే హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న నకిరేకల్ శివారులోని పద్మానగర్ జంక్షన్ ప్రమాదరకంగా మారింది. ప్రజలు, వాహనదారులు ఈ జంక్షన్ వద్ద రోడ్డు దాటాలంటే హడలెత్తిపోతున్నారు. మరోవైపు ప్రధాన కూడళ్లలో లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళలో అంధకారం నెలకొంటోంది. 14 ఏళ్ల క్రితం విస్తరించిన హైదరాబాద్–విజయవాడ రహదారిలో వాహనదారులు ఇంకా సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ రహదారి గుండా నిత్యం 50 వేలపైనే వాహనాలు వెళుతుంటాయి.

జంక్షన్ వద్ద తరచూ ప్రమాదాలు

నకిరేకల్ నియోజకవర్గంలోని నకిరేకల్, కేతేపల్లి, కట్టంగూరు, నార్కట్‌పల్లి, చిట్యాల మండలాల మీదుగా 65 కి.మీ హైవే విస్తరించింది. ఏళ్ల గడుస్తున్నా జీఎమ్మార్, హైవే అధికారులు సర్వీస్ రహదారులను పట్టించుకోకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా నకిరేకల్‌లోని పద్మానగర్ జంక్షన్ వద్ద అండర్‌పాస్ వంతెన నిర్మాణం కలగానే మిగులుతోంది. నకిరేకల్‌లోని చీమలగడ్డ ఫ్లై ఓవర్ అండర్ పాస్ నుంచి ఇనుపాముల జంక్షన్ వరకు కూడా సర్వీస్ రోడ్డు పూర్తి కాలేదు. నకిరేకల్ పట్టణం నుంచి హైదరాబాద్, నల్లగొండ వైపు వెళ్లాలంటే జంక్షన్ దాటి వెళ్లాలి. జంక్షన్ దాటే క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలు అతి వేగంతో వెళ్తుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ వీధి లైట్లు లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నకిరేకల్‌లోని పద్మానగర్ వద్ద రెండేళ్లలో నలుగురు ప్రాణాలు కోల్పోగా 30 మందికి పైగా గాయాలపాలయ్యారు. ఈ జంక్షన్ పక్కనే పద్మానగర్ కాలనీ ఉంది. ఈ కాలనీవాసులు రాత్రి వేళలో జాతీయ రహదారి కూడలి దాటి నకిరేకల్ పట్టణానికి రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు. పద్మానగర్ జంక్షన్ వద్ద అండర్ పాస్ వంతెన నిర్మించి ప్రమాదాలను నివారించాలని నకిరేకల్ పట్టణవాసులు, వాహనదారులు కోరుతున్నారు.

అండర్‌పాస్ వంతెన నిర్మించాలి



పద్మానగర్ జంక్షన్ వద్ద అండర్ పాస్ వంతెన నిర్మించాలి. ఈ జంక్షన్ వద్ద రోడ్డు దాటాలంటే భయంగా ఉంది. ఈ జంక్షన్ వద్ద లైట్లు లేకపోవడంతో రాత్రి వేళలో అంధకారంగా ఉంటోంది. రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి అండర్ పాస్ వంతెన నిర్మించాలి.

– చిట్టిప్రోలు యాదగిరి, పద్మానగర్, నకిరేకల్

సర్వీస్ రోడ్లను పూర్తి చేయాలి



నకిరేకల్‌లోని బైపాస్ మార్గంలో అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి. ఈ పనులు పూర్తయితే సర్వీస్ రోడ్ల గుండా ప్రయాణం సులభంగా ఉంటుంది. ప్రమాదాలు కూడా జరగకుండా ఉంటాయి. అండర్‌పాస్ వంతెన నిర్మాణానికి ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి.

– నక్క రాంభూేష్, నకిరేకల్

జీఎమ్మార్ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



జీఎమ్మార్ సంస్థ అధికారులతో మాట్లాడి నకిరేకల్ బైపాస్ మార్గంలో పద్మానగర్ వెళ్లే దారిలో విద్యుత్ లైట్లు వేయించేందుకు తగు చర్యలు తీసుకుంటాం. పద్మానగర్ జంక్షన్ వద్ద ప్రమాదాల జరగకుండా శాశ్వత పరిష్కారం కోసం అండర్ పాస్ వంతెన నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేయాలని జీఎమ్మార్ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– డి.బాలయ్య, మున్సిపల్ కమిషనర్, నకిరేకల్

ఘనంగా రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కనగల్: మండల పరిధిలోని పగిడిమర్రి గ్రామంలో గల పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీ సీతా రామచంద్ర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యహవాచనం, నిత్యపూజలు, శ్రీ జమదగ్ని రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు కనులపండువగా నిర్వహించారు. అనంతరం బోనాలు, మంగళనీరాజనం, అర్చనలు చేశారు. శనివారం రుద్రహోమం, శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణం, వీరబ్రహ్మేంద్రస్వామి హోమం, గణపతి హోమం, 25న వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవం, 26న అగ్నిగుండాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎర్రమాద యశోదమ్మ మాజీ సర్పంచ్‌లు గోలి నర్సిరెడ్డి, గోలి జగాల్‌రెడ్డి, సుంకిరెడ్డి కృష్ణారెడ్డి, ఇడుకుళ్ల రవీందర్, ఎర్రమాద వెంకట్‌రెడ్డి, సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, సుంకిరెడి రవీందర్‌రెడ్డి, కేశవరెడ్డి, సింగం మల్లేష్ దేవస్థాన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి రావాలని హోమం


రామాలయంలో హోమం చేస్తున్న నాయకులు

మునుగోడు: స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి రాష్ట్ర మంత్రి పదవి రావాలని కోరుతూ మునుగోడు మండలంలోని చీకటిమామిడి గ్రామ రామాలయంలో ఆ గ్రామ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హోమం నిర్వహించారు. డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు హోమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అనునిత్యం రాష్ట్ర అభివృద్ధికి, పేద ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నాడని అన్నారు. అలాంటి నాయకుడికి మంత్రి పదవి ఇస్తే పేద ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ అనంత వీణలింగస్వామి, తాటికొండ సైదులు, పాలకూరి యాదయ్య గౌడ్, ఏరుకొండ అంజయ్య, మేకల మల్లయ్య, చిలువేరు సత్తయ్య, రాజు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా పోటీ చేసే అవకాశం కల్పించాలి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ నియోజకవర్గ లోక్‌సభ అభ్యర్థిగా పోటీచేసేందుకు తనకు అవకాశం కల్పించాలని బీజేపీ జిల్లా నాయకుడు తొక్కని మన్మథరెడ్డి అధిష్టానాన్ని కోరారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగంలో విశేష సేవలందిస్తున్న తనకు బీజేపీ టికెట్ ఇస్తుందనే నమ్మకం ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు బూర మల్సూర్‌గౌడ్, పాలకూరి రవిగౌడ్, ఫన్నీ నాయుడు హరిప్రసాద్, రవి వర్మ, మనోహర్, గణేశ్ తదితరులు ఉన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు


బదిలీ అయినవారిని సత్కరిస్తున్న అధికారులు

నకిరేకల్: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. నకిరేకల్ వ్యవసాయశాఖ ఏడీఏగా పనిచేసిన శ్రీధర్‌రెడ్డి సూర్యాపేట జిల్లా వ్యవసాయాధికారిగా పదోన్నతిపై వెళ్లారు. అదేవిధంగా డీఏఓ కార్యాలయ ఏడీఏ హుస్సేన్‌బాబు సూర్యాపేట జిల్లాకు, నకిరేకల్ మండల వ్యవసాయాధికారి మల్లేష్ నాంపల్లి మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక రైతు వేదిక భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. బదిలీపై వెళ్తున్న అధికారులను ఘనంగా సత్కరించారు. స్థానిక ఏడీఏ రామారావు నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నకిరేకల్ ఏఓ జానిమియా, సిబ్బంది గిరి ప్రసాద్, సౌమ్య శృతి, అమరేందర్‌రెడ్డి, లింగయ్య, దాహితుల్లా, నాగరాజు, బాలరాజు, ఉమేష్, వీరేష్, శ్రావణ్‌రెడ్డి నవీన్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం


ఓపెన్ ఫోరంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నాగిరెడ్డి

నాంపల్లి : ఉపాధిహామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఓ నాగిరెడ్డి అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా నాంపల్లి మండలంలో 2021 సంవత్సరం నుంచి 2023 వరకు జరిగిన పనులపై ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేత అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ పాల్గొని మాట్లాడారు. మండలంలో రూ.2,28,66,824 చెల్లించాల్సి ఉండగా రూ.1,25,29,229 చెల్లించారని సామాజిక తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. కొన్ని గ్రామాల్లో చేసిన పనుల కంటే అధికంగా చెల్లింపులు చేశారని అన్నారు. గ్రామాల్లో నర్సరీల నిర్వహణలో లోపాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇటీవల పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో వేసిన సీసీ రోడ్లకు సంబంధించిన రికార్డులు ఇవ్వలేదని సామాజిక తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతాప్రమాణాలు పాటించలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అడిషనల్ డైరెక్టర్ నవీన్, ఎంపీడీఓ శేషుకుమార్, మేరీ స్వర్ణకుమారి, అంబుడ్స్‌మెన్ మహ్మద్ గౌరీ, విజిలెన్స్ అసిస్టెంట్ మేనేజర్ గౌతమీ, ఏపీఓ ఇర్మియా, ఈసీలు తుల్చానాయక్, వివేక్‌సాగర్, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

చండూరు మార్కెట్ చైర్మన్ పదవి దక్కేది ఎవరికో!

- బీసీ జనరల్ రిజర్వేషన్‌గా ప్రకటించిన ప్రభుత్వం
- పదవి దక్కించుకోవడానికి ఆశావహుల తీవ్ర ప్రయత్నం



మునుగోడు: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన గత ప్రభుత్వ హయాంలో నియమించిన నామినేటెడ్ పదవులను రద్దు చేసింది. ఇటీవల మార్కెట్ చైర్మన్ పదవులను భర్తీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌లను నియమించేందుకు ఇప్పటికే ఆయా మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లు సైతం ప్రకటించింది. ఇందులో భాగంగా మునుగోడు నియోజకవర్గంలోని చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బీసీ జనరల్ స్థానానికి కేటాయించారు. ఆ చైర్మన్ పదవిని ఎలాగైనా దక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీలో కీలకంగా పనిచేసిన నాయకులతోపాటు గత ఎన్నికల సందర్భంగా ఇతర పార్టీలకు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు సైతం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఆ పదవి ఎవరికి దక్కుతుందనే చర్చ నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది.

1970లో మార్కెట్ ఏర్పాటు

చిట్యాల మార్కెట్ యార్డు పరిధిలో ఉన్న మునుగోడు, చండూరు మండలాలను వేరుచేసి 1969లో మునుగోడు సబ్ మార్కెట్ యార్డును ఏర్పాటు చేశారు. ఆ తరువాత 1970 సంవత్సరంలో మునుగోడు, చండూరు, నారాయణపురం మండలాలను కలిపి చండూరు మార్కెట్ యార్డును ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ పార్టీకి చెందిన నాయకులు వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా కొనసాగుతూ వస్తున్నారు.

కొండంత ఆశతో మునుగోడు నాయకులు..

చండూరు వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో మునుగోడు, చండూరు మండలాలతోపాటు యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం కూడా ఉంది. మార్కెట్ యార్డు ఏర్పాటైన నాటి నుంచి నేటి వరకు దాదాపు 10 మందికిపైగా చైర్మన్ పదవులు పొందగా అందులో అధికంగా చండూరు, నారాయణపురం మండలాలకు చెందిన నాయకులే ఉన్నారు. మునుగోడు మండలానికి చెందిన కేవలం ఇద్దరు నాయకులు మాత్రమే మార్కెట్ చైర్మన్ పదవులు పొందారు. అంతేకాకుండా 15 ఏళ్లుగా ఆ రెండు మండలాలకు చెందిన నాయకులు మాత్రమే చైర్మన్ పదవులు పొందారు. దీంతో ఈ దఫా తప్పకుండా మునుగోడు మండలానికి చెందిన నాయకులకు చైర్మన్ పదవి దక్కుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎలాగైనా మార్కెట్ చైర్మన్ పదవి దక్కించుకునేందుకు స్థానిక ఎమ్మెల్యేతోపాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నాయకులను కలిసి తమకు చైర్మన్ పదవి ఇవ్వాలని స్థానిక నాయకులు వేడుకుంటున్నారు.

నేడు రథోత్సవం

మర్రిగూడ: సరంపేట గ్రామంలోని శ్రీ స్తంభగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు మారెపల్లి వెంకటాచార్యులు, ఆలయ ధర్మకర్త మారెపల్లి నర్సింహాచార్యులు శుక్రవారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని రథోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మతగురువులు సమాజ సేవకు పాటుపడాలి


గురు పట్టాభిషేకం పొందిన జయరాజును సన్మానిస్తున్న ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

కేతేపల్లి: గురు పట్టాభిషేకం పొందిన క్రైస్తవ మతగురువులు సమాజ సేవకు పాటుపడాలని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం కేతేపల్లి మండలంలోని భీమారం గ్రామంలో గల యేసు తిరుహృదయ చర్చిలో నిర్వహించిన కోట జయరాజు గురు పట్టాభిషేక మహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రైస్తవ మతగురువులు తమ బోధనల ద్వారా ప్రజలు సన్మార్గంలో పయనించేలా చైతన్యం చేయాలన్నారు. అనంతరం గురు పట్టాభిషేకం పొందిన జయరాజును నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి వేముల పుష్ప అభినందించారు. కార్యక్రమంలో నల్లగొండ విశ్రాంత పీఠాధిపతులు గణగోవిందుజోజి, మాజీ సర్పంచులు బడుగుల శ్రీనివాస్‌యాదవ్, బడుగుల కవితనరేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్, నోముల రామకృష్ణ, కోట శ్రీనివాస్, మట్టపల్లి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం


నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

రామగిరి(నల్లగొండ): విద్య జీవిత ప్రగతికి పునాది అని తిప్పర్తి జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి అన్నారు. తిప్పర్తిలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో శుక్రవారం జరిగిన పాఠశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ కె.అరుంధతి, పాఠశాల చైర్మన్ రమేష్‌రెడ్డి, ముత్తినేని శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

సంత్ గాడ్గే బాబాకు నివాళి

నల్లగొండ టౌన్ : సంఘ సంస్కర్త సంత్ గాడ్గే బాబా 149వ జయంతిని పురస్కరించుకుని బాబా చిత్రపటానికి స్థానిక పూలే విగ్రహం వద్ద రాష్ట్ర రజక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, రజక అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్ చిలకరాజు చెన్నయ్య, జిల్లా అధ్యక్షుడు చిలకరాజు సతీష్‌కుమార్, బీమనపల్లి శంకరయ్య, ఆమంచి అంజయ్య, చిక్కుల్ల రాములు, సత్తయ్య, ఎల్లుట్ల సైదులు, పగిళ్ల వెంకన్న, బూతరాజు సత్తయ్య, వెలిజాల అంజయ్య, నాగిళ్ల శంకర్, ఈదయ్య, యాదయ్య, మల్లేష్, యాదగిరి, జానీ నర్సింహ, దుర్గ పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్

కాంగ్రెస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు: కాంగ్రెస్ పాలనలోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మునుగోడు మండలంలోని కొరటికల్ గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మునుగోడు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ప్రతి గ్రామంలో రూ.10 లక్షల నుంచి రూ. 20 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మందుల బీరప్ప, రమణారెడ్డి, యాదగిరిచారి, ఐతగోని బుచ్చయ్య, ఐతగోని సైదులు, మందుల అంజయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు దండు లింగస్వామి, ఆరెకంటి పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


చిట్యాల జెడ్పీహెచ్ఎస్‌లో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిట్యాల: పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మరికొందరు విద్యార్థులు అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం కె.కరుణాకర్ రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సరఫరా చేయాలి

మర్రిగూడ: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సరఫరా చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చెరుకు లింగంగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 49 అంగన్‌వాడీ కేంద్రాల్లో 494 మంది చిన్నారులు ఉన్నారని తెలిపారు. వేసవికాలంలో ఎండ వేడిమిని చిన్నారులు తట్టుకోలేకపోతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్‌న సరఫరా చేసి ఫ్యాన్లు ఏర్పాటు చేయాలన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు తప్పవు


మునుగోడు : బెల్టు దుకాణాల నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

మునుగోడు: గ్రామాల్లో బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు కొనసాగిస్తే కేసులు తప్పవని మునుగోడు ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఇప్పటివరకు బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయించిన వ్యాపారులను శుక్రవారం స్టేషన్‌కు పిలిచి పలు సూచనలు చేశారు. బెల్టు దుకాణాల ద్వారా మద్యం అమ్మకాలు కొనసాగించవద్దని, ఎవరైనా విక్రయిస్తే మద్యాన్ని సీజ్‌చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే తనకు సమాచారం ఇవ్వాలని, ఆ వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

మర్రిగూడ: గ్రామాల్లో బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ కె.రంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన ఈద అనూష ఇంట్లో దాడులు నిర్వహించగా పది కేఎఫ్ లైట్ బీర్లు, మూడు ఐబీ ఫుల్ బాటిళ్లు లభించాయని తెలిపారు. ఎక్సైజ్ చట్టం ప్రకారం అనూషపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

నల్లగొండ టూటౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. ది తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ నల్ల గొండ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలో శుక్రవారం జరిగిన కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రాథమిక దశ నుంచి తమకు నచ్చిన క్రీడల్లో పాల్గొని నైపుణ్యత చాటాలని కోరారు. అనంతరం పలువురికి కలర్ బెల్ట్‌లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్, బీఆర్ఎస్ నాయకుడు యామ దయాకర్, బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కత్తుల శంకర్, ప్రణీత్, కమల్ తదితరులు పాల్గొన్నారు.


బెల్టుల ప్రదానోత్సవంలో పాల్గొన్న గుత్తా అమిత్‌రెడ్డి